విశాలాంధ్ర
విశాఖపట్నం
మంగళవారం 30, డిసెంబర్ 2025

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - మల్కాపురం: స్థానిక జవహర్ నగర్ దగ్గర గల అంగన్వాడి సెంటర్లో సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్-1 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా సోమవారం కంటి వైద్య శిబిరాన్ని ప్రముఖ వైద్యులు డాక్టర్ భాగ్యరాజ్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 150 మంది ఉచితంగా కంటి పరీక్షలను చేయించుకున్నారు. 13 మంది ఉచిత ఆపరేషన్లకు ఎంపికయ్యారు. ఈ శిబిరం పట్ల స్థానికులు హర్షం వెలుగుచ్చారు. ఈ శిబిరాన్ని ప్రోగ్రాం అధికారి సంధ్యారాణి నిర్వహించగా 50 మంది వాలంటీర్లు తమ సేవలను అందించారు. కార్యక్రమంలో మెడికవర్ వైద్య సిబ్బంది డాక్టర్ రాజు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

అదేవిధంగా సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ -2 ఆధ్వర్యంలో ఇందిరా కాలనీలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో స్థానికులకు వృత్తి విద్యా శిక్షణను వాలంటీర్లు అందజేశారు.

కార్యకర్తలు ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారదులు

- ఎంపీ శ్రీభరత్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: కార్యకర్తలే ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారదులుగా నిలవాలని ఎంపీ శ్రీ భరత్ అన్నారు. సోమవారం జిల్లా టిడిపి కార్యాలయంలో నిర్వహించిన 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం చెందిన ఎంపిక చేసిన 36 మంది కార్యకర్తలను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన ప్రతి కార్యకర్తను టీడీపీ గుర్తిస్తుందన్నారు. భవిష్యత్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా చురుగ్గా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యక్రమాల్లో మరింత చురుగ్గా పాల్గొని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ, విశాఖ టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గానికి నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు చోడే పట్టాభిరామ్, ప్రధాన కార్యదర్శి లోడగల కృష్ణ, మాజీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాస్, విశాఖ ఉత్తర నియోజకవర్గానికి చెందిన టిడిపి కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో గ్రేటర్ విశాఖ టాప్

- గత ఏడాది కన్నా ఈ ఏడాది 100 కోట్లు అదనంగా వసూళ్లు
- రెవెన్యూ సిబ్బందిని పరుగులెత్తిస్తున్న కమిషనర్
- ఊరంతా జప్తు నోటీసులే

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: గ్రేటర్ విశాఖలో పన్నుల వసూళ్లలో సచివాలయం వార్డు అడ్మిన్‌ల దగ్గర నుండి రెవెన్యూ విభాగంలో డిప్యూటీ కమిషనర్ వరకు పన్నులు వసూళ్లలో తల మునకలై పరుగులు పెడుతున్నారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ గ్రేటర్‌లో పన్నుల వసూళ్లలో వార్డుల వారీగా టార్గెట్లు ఇవ్వడంతో ఊరంతా జప్తు నోటీసులతో తాకీదులిస్తున్నారు. డిసిఆర్‌గా సత్తార్ శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి రెవెన్యూ విభాగంలో ప్రక్షాళన చేస్తూ, అవినీతి అధికారుల భరతం పడుతూ, అనునిత్యం తమ టార్గెట్లను పూర్తి చేసుకునేలా, పన్నుల వసూళ్లలో ఏ ఒక్కరూ అశ్రద్ధ చూపకుండా అనునిత్యం పర్యవేక్షణ చేస్తూ గ్రేటర్ విశాఖలో పెద్ద ఎత్తున పన్నుల వసూళ్లలో టాప్‌గా జీవీఎంసీ నిలబెట్టిన ఘనత డిసిఆర్‌దేనిని చెప్పవచ్చు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను తక్షణమే చెల్లించాలని లేని పక్షంలో ఆస్తుల జప్తులు తప్పవని గ్రేటర్ రెవెన్యూ అధికారులు స్పష్టమైన సంకేతాలు పంపిస్తున్నారు. గ్రేటర్ విశాఖలో సుమారు 6 లక్షలకు పైగా అసెస్మెంట్లు ఉన్నాయి. వీటి ద్వారా 2025-26 వార్షిక సంవత్సరానికి సంబంధించి నివాసాలు, వాణిజ్య భవనాలు, ఇతర సముదాయాల నుంచి రూ.566 కోట్లు వసూలు చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అయితే వసూళ్లలో మంచి పురోగతి సాధించారు. మార్చినాటికి సాధించాల్సిన వసూళ్ల ప్రక్రియ డిసెంబర్ నాటికే రూ.100 కోట్లు అదనంగా గత ఏడాదికన్నా వసూలు చేసి టాప్‌లో నిలిచారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఇటీవలే రెవెన్యూ విభాగం డిప్యూటీ కమిషనర్ సత్తార్ శ్రీనివాస్ ఇతర రెవెన్యూ అధికారులు, ఇన్స్పెక్టర్లు, ఇతర సిబ్బందికి ప్రతి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమీక్షలో పన్నుల వసూళ్ల పురోగతిని పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు కమిషనర్, డిసిఆర్ చేయడంతో వార్డు సెక్రటరీలను భాగస్వాములను చేశారు. సోమవారం నాటికి పాత, కొత్త బకాయిలు కలిపి సుమారు రూ.391 కోట్లు ఆస్తిపన్ను, ఖాళీస్థలాల పన్ను వసూలు చేసినట్లు అధికారులు కమిషనర్‌కు తెలియజేశారు. అయితే ఈ నేపథ్యంలోనే మొండి బకాయిల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. ప్రస్తుత వార్షిక సంవత్సరానికి సంబంధించి సుమారు 9 నెలలు పూర్తి కావచ్చింది. ఇంకా మూడు నెలలు మాత్రమే ఈ ఏడాదిలో మిగిలి ఉంది. గత ఏడాది డిసెంబర్ 29 నాటికి రూ.298.21 కోట్లు వసూలు కాగా, ఈ ఏడాది ఇదే తేదీకి రూ.391 కోట్లు వసూలు చేశారు. అంటే అదనంగా రూ.93.35 కోట్లు వసూలు చేసినట్లు తెలుస్తోంది. మరోపక్క ఇంటింటికి వెళ్లి పన్నులు వసూళ్లను అధికారులు ముమ్మరం చేశారు. డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సత్తార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎనిమిది జోన్ల పరిధిలోని రెవెన్యూ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది మొండి బకాయిదారులకు జప్తు నోటీసులు జారీ చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 60 వేల మందికి రెడ్ నోటీసులు అందజేసినట్లు తెలిసింది. సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని అలాగే మొండి బకాయిలు చెల్లించకపోతే సంబంధిత వ్యక్తుల ఆస్తులు జప్తు చేయడం జరుగుతుందని నోటీసుల్లో పేర్కొంటున్నారు. అలాగే మరో 20వేల మందికి కొళాయి కనెక్షన్లు కట్ చేస్తామని కూడా నోటీసుల్లో పేర్కొన్నారు. గడువులోగా బకాయిలు చెల్లించకపోతే మంచినీటి సదుపాయం లేకుండా కొళాయి కనెక్షన్లు కట్ చేస్తారు. ఇప్పుడు జీవీఎంసీకి ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్నుల ద్వారా మాత్రమే పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతుంది. ఆ తరువాత మంచినీటి సరఫరా విభాగం నిలుస్తుంది. స్టీల్ ప్లాంట్ 600 కోట్లు జీవీఎంసీ పన్ను బకాయి ఉంది. అలాగే విశాఖపట్నం పోర్టు రూ.210 కోట్లు, రైల్వే రూ.15 కోట్లు బకాయిలు ఉన్నాయి. వీటితోపాటు కొన్ని ప్రైవేటు సంస్థలు కూడా కోట్లాది రూపాయలు బకాయిలు పెండింగ్లో ఉన్నాయి. అయితే వాటి ఆస్తులను జప్తు చేయాలని, పేద, సామాన్య ప్రజలపై రెవెన్యూ అధికారులు ప్రతాపం చూపకుండా పెద్ద మొత్తంలో కోట్లాది రూపాయల బకాయిలు ఉన్న వారి ముక్కు పిండి వసూలు చేయాలని అనేక కాలనీల అసోసియేషన్లు తెలియజేస్తున్నాయి.

మురికివాడ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణానికి కృషి

మంత్రి డాక్టర్ పి.నారాయణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్రంలోనే అత్యధికంగా మురికివాడ ప్రాంతాలు కలిగి ఉన్న విశాఖ నగరంలో నిర్వాసితులకు తక్షణమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారని దీనికి సంబంధించి ప్రత్యేక యాక్షన్ ప్లాన్స్ సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ తెలిపారు. విశాఖ పర్యటనలో భాగంగా సోమవారం దక్షిణ నియోజక వర్గంలోని వెలంపేట లక్ష్మీ నగర్ మురికివాడ ప్రాంతంలో నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు,దక్షిణఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కమిషనర్ కేతన్ గార్గ్, వీఎమ్మార్డీఏ కమిషనర్ ఎన్.తేజ్ భరత్, స్థానిక కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, ఇతర అధికారులతో కలిసి పర్యటించారు. ఈ క్రమంలోనే మేయర్, ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్, జీవీఎంసీ కమిషనర్ మంత్రికి ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన అంశాలపై వివరించారు. 50 ఏళ్లుగా ఇదే ప్రాంతంలో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నామని తమకు తక్షణమే ఇళ్ల నిర్మాణాలు మంజూరు చేసే దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు మంత్రిని కోరారు. వర్షాకాలంలో చాలా ఇబ్బందులకు గురవుతున్నామని, 177 కుటుంబాలకు ఇళ్లను నిర్మించి మౌలిక సదుపాయాలను కల్పించాలని మంత్రికి నివాసితులు విజ్ఞప్తి చేశారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ ఆయా నిర్వాసితుల ఇళ్లకు వెళ్లి స్వయంగా వారు పడుతున్న ఇబ్బందులను పరిశీలించారు. అయితే ఆరు చదరపు అడుగుల స్థలంలో జీవనం సాగించడం బాధాకరమని వారికి ఇళ్లను నిర్మించే చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ చాలాకాలంగా వెలంపేట మురికివాడ ప్రాంత సమస్య అలాగే ఉందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ మురికివాడ ప్రాంత అభివృద్ధిపై దృష్టి సారించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, వి.ఎం సత్యవేణి, ప్రధాన ఇంజనీర్ పీ.వీ.సత్యనారాయణ రాజు, జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు, పర్యవేక్షక ఇంజనీరు పల్లమరాజు, రాయల్ బాబు, సహాయక వైద్యాధికారి డాక్టర్ కృష్ణంరాజు, ఏపీడి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యం తక్షణమే బకాయి జీతాలు చెల్లించాలి

విశాలాంధ్ర - గాజువాక : విశాఖ ఉక్కు కర్మాగారం యాజమాన్యం తక్షణమే మిగిలిన జీతాలు చెల్లించాలని స్టీల్ ఏఐటీయూసీ గుర్తింపు కార్మిక సంఘం డిమాండ్ చేసింది. గుర్తింపు యూనియన్ అధ్యక్షులు కెఎస్ఎన్ రావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో మాట్లాడుతూ కార్మికులు మొక్కవోని దీక్షతో మొత్తం కార్మిక వర్గం మానవ వనరులు తగ్గిన, క్యాంటీన్ సదుపాయాలు తీసివేసిన పూర్తి స్థాయిలో ప్రొడక్షన్స్ తీస్తున్నారని గుర్తు చేశారు. ఉత్పత్తి ఆధారంగా జీతాలు చెల్లించాలని ఇచ్చిన సర్క్యులరు రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న మొత్తం జీతాలు వెంటనే చెల్లించాలని కోరారు. కార్మికుల హెచ్ఆర్ఏ విడుదల చేసి, ఉక్కునగరంలో పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలన్నారు. 24 గంటలు క్యాంటీన్ సదుపాయం కల్పించాలని ఈఎల్ పెంచాలని సెయిల్ విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల కాలం నుంచి యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం మన ప్లాంట్‌ను మొత్తం కార్మిక వర్గాన్ని మానసికంగా, ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తోంది అని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని యూనియన్లు అఖిలపక్షంగా పోరాడినా మన యాజమాన్యంకు దున్నపోతు మీద వర్షం కురిసినట్లు ఉంటుందని, ఎక్కువ ధరకు నాసిరకం ముడి సరుకులు కొనుగోలు చేసి ఉత్పత్తి తీస్తు స్టీల్ ప్లాంట్ నష్టాలకు కారకులు అయ్యారని, ఇప్పటికైనా స్టీల్ ప్లాంట్ ను సైల్ లో విలీనం ఒక్కటే ప్రత్యామ్నాయం అని చెప్పడం మినహా మరో మార్గం లేదన్నారు. ఈ ధర్నా కార్యక్రమానికి డొక్కా నర్సింగరావు, జె.రామకృష్ణ, టిఎస్ఎన్ ఏ.శివరామకృష్ణ, బిఎంఎల్ నాయుడు, పి.వెంకటేష్, ఇందల శివ, బి.జగదీష్, రామచంద్ర రాజు పాల్గొన్నారు.

విశాఖ పోర్టు డిప్యూటీ చైర్మన్‌గా రోష్ని అపరాంజి కోరాటి

తొలిసారిగా విశాఖ పోర్ట్‌కు డిప్యూటీ చైర్ పర్సన్‌గా మహిళా ఐఏఎస్ అధికారి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ పోర్టు చరిత్రలో మరో క్రియాశీలక యువ మహిళా ఐఏఎస్ అధికారి డిప్యూటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. రోష్ని అపరాంజి కోరాటి ఐఏఎస్ (2011) విశాఖపట్నం పోర్ట్ అథారిటీ డిప్యూటీ చైర్ పర్సన్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం పోర్ట్‌లో ఈ పదవిని చేపట్టిన తొలి మహిళా ఐఏఎస్ అధికారిణిగా ఆమె చరిత్ర సృష్టించారు. అస్సాం - మేఘాలయ కేడర్‌కు చెందిన రోష్ని అపరాంజి కోరాటి విశాఖపట్నానికి చెందినవారు. ఆమె తన విద్యాభ్యాసమంతా విశాఖపట్నంలోనే పూర్తి చేశారు. ఆమె తండ్రి విశాఖపట్నం పోర్ట్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించారు. తండ్రి సేవలు అందించిన సంస్థకు ఆమె డిప్యూటీ చైర్ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించడం అత్యంత గర్వకారణం. 03 ఏప్రిల్ 1984న జన్మించిన రోష్ని ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి జర్నలిజం మాస్ కమ్యూనికేషన్‌లో మాస్టర్స్ డిగ్రీలో గోల్డ్ మెడలిస్ట్. జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో విస్తృత పరిపాలనా అనుభవం కలిగిన ఆమె అస్సాంలో జోర్హాట్ జిల్లాకు అదనపు ఉప కమిషనర్‌గా, అనంతరం అదే జిల్లాకు కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్‌గా సేవలందించారు. విశాఖపట్నం పోర్ట్ అథారిటీకి నియామకానికి ముందు కేంద్ర డిప్యూటేషన్‌లో విశాఖ స్పెషల్ ఎకనామిక్ జోన్‌లో జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్‌గా పనిచేశారు. 2018లో ప్రజాపరిపాలనలో విశిష్ట సేవలకు గాను ప్రధాని అవార్డు సహా అనేక పురస్కారాలు పొందిన ఆమె, సమర్థవంతమైన ప్రజాసేవకురాలిగా విశేషంగా గుర్తింపు పొందారు.

హిందువుల జీవనంలో వసుధైక కుటుంబం ఉంటుంది

విశాలాంధ్ర - పద్మనాభం: హిందువుల జీవన విధానంలోనే ప్రపంచాన్ని వసుధైక కుటుంబంగా భావిస్తుందని ఆర్ఎస్ఎస్ ఆంధ్ర ప్రదేశ్ ప్రాంత కార్యకారిణి సభ్యులు దువ్వూరు యుగంధర్ అన్నారు. సోమవారం పద్మనాభం మండలం లింగన్నపేట గాయత్రీ మాత ఆలయం ప్రాంగణంలో హిందూ సమ్మేళనం కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన దువ్వూరు యుగంధర్ మాట్లాడుతూ విశ్వంలో మరీ ఎక్కడా లేనివిధంగా హిందువుల జీవన విధానము సంస్కృతి సంప్రదాయాలు ఉంటాయన్నారు. హిందూ జీవన విధానమే ప్రకృతి ఆరాధనతో ముడిపడి ఉంటుందన్నారు. గాయత్రీ మాత ఆశ్రమం నార్ల రామకృష్ణ మాట్లాడుతూ హిందువులు ఇప్పటికైనా మేలుకోకుంటే భారతీయులు తన ఉనికిని కోల్పోతుందన్నారు.

కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ కోరుకొండ రామలక్ష్మీ, విశాఖ జిల్లా ఆర్ఎస్ఎస్ సహకార్యవాహ తమ్మన నరసింహారావు, కే రామరాజు, బొత్స సత్యనారాయణ, గెద్ద ప్రసాద్, బూర్ల చిరంజీవి, డి అప్పలరాజు, కేశవ నాయుడు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను ఆన్‌లైన్ చేయాలి

వీఎంఆర్డీఏ ఎంసీ తేజ్ భరత్

విశాలాంధ్ర - విశాఖ: ప్రజా దర్బార్‌కి వచ్చిన ఫిర్యాదులన్నింటినీ ఆన్‌లైన్ చేయాలని వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్లో ఆయన మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న ఫిర్యాదులు, రాబోయే ఫిర్యాదులు.. అన్నీ ఆన్‌లైన్‌లో ఉండాలన్నారు. దీనికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీఎంఆర్డీఏ ప్రజా దర్బార్‌కి 9 ఫిర్యాదులు అందాయని ఆయన తెలిపారు. ఈ ఫిర్యాదులను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుల్ని సకాలంలో పరిష్కరించాలన్నారు.

ఎఫ్ఎల్ఎన్ స్థాయి పరిశీలనకు పాఠశాలల సందర్శన

విశాలాంధ్ర - ఆనందపురం: రాష్ట్ర విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గ్యారెంటెడ్ ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా ఆనందపురం మండలంలోని ఎంపీపీఎస్ దుక్కవాని పాలెం, జి.ఎస్.అగ్రహారం, నేలతేరు పాఠశాలలను స్టేట్ అబ్జర్వర్ ఎస్సీఈఆర్టీ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా విద్యార్థుల పఠన, గణిత నైపుణ్యాల ఎఫ్ఎల్ఎన్ స్థాయిలను పరిశీలించి పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా బోధనా విధానాలు, పాఠ్య ప్రణాళికల అమలు తీరును పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా అసిస్టెంట్ ఏఎంఓ లక్ష్మి, సీఆర్ఎం ఉపాధ్యాయులు జి. శివాజీ, గౌరీ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే

- రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని రాష్ట్ర టిడిపి అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం విశాఖలోని తన నివాసంలో స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టియు) 2026 క్యాలెండర్, డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పోటీ పడాలని, దానికి ఉపాధ్యాయులు ఎంతో కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు. ఉత్తమ బోధన అందిస్తూ తల్లిదండ్రులకు ఇటు విద్యార్థుల్లో నమ్మకాన్ని కలిగించాలన్నారు. విద్యా వ్యవస్థ అభివృద్ధి కోసం 31,000 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం వెచ్చిస్తోందన్నారు. క్రమశిక్షణ కలిగిన పౌరులుగా తయారుచేసి రాష్ట్రం, దేశం గర్వించదగ్గ వ్యక్తులుగా తీర్చిదిద్దాలన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న యాప్‌ల భారాన్ని ఆన్లైన్ వర్క్ బోధనకు ఆటంకంగా ఉందని సంఘ నాయకులు ఎమ్మెల్యే శ్రీనివాసరావు దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎస్టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్ర పద్మావతి, ఇమంది పైడిరాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఐవీ.రామిరెడ్డి, జీవిఎంసి బాధ్యులు పురుషోత్తం, నారాయణ రెడ్డి గౌరవాధ్యక్షులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాముల ఆత్మ బలిదానం మరిచిపోకూడదు

సంస్మరణ సభలో వక్తలు

విశాలాంధ్ర - విశాఖ : అమరజీవి పొట్టి శ్రీరాముల త్యాగాన్ని మరిచిపోకూడదని, అతని త్యాగనిరతిని ముందు తరాల వారికి తెలియజేయవలసిన ఆవశ్యకత ఉందని ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఎ.నరసింహా రావు అన్నారు. సమైక్య భారతి, అభ్యుదయ రచయితల సంఘం, ఆంధ్ర ప్రదేశ్ ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో విశాఖ పౌర గ్రంథాలయంలో 'అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మబలిదానం - డిసెంబర్ 15పై 'సమైక్య తెలుగు దినోత్సవం' పేరుతో చర్చా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఆచార్య వి.బాల మోహనదాస్ ముఖ్య అతిథిగా హాజరై తెలుగు, ఆంగ్ల భాషల మధ్య తారతమ్యాన్ని విశ్లేషిస్తూ, తెలుగు భాష శాశ్వతమైనదని ఉదాటించారు. మహాత్మా గాంధీ ఆశయాలను పొట్టి శ్రీరాములు పాటించారని విశదీకరించారు. ఆచార్య పేటేటి ప్రేమానందం పొట్టి శ్రీరాములు గూర్చి విద్యార్థులకు తెలియజేయాలని అన్నారు. ఆచార్య బి.మంజులత ప్రసంగిస్తూ తెలుగుకు ప్రాధాన్యత ఇవ్వని పరిస్థితులు ఉన్నాయని, అవి మారాలని అభిప్రాయపడ్డారు. రాఘవరావు మాట్లాడుతూ జంధ్యాల రచనలను ఉదహరించారు. 56 రోజుల పొట్టి శ్రీరాముల ఆమరణ నిరాహారదీక్షను వివరించారు. అభ్యుదయ రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు మాట్లాడుతూ అరసం ఉద్దేశాన్ని వివరించారు. సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త వి.కన్నయ్య మాట్లాడుతూ కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. ప్రజానాట్యమండలి తరుపున బి.చిరంజీవులు, గురుబిల్లి కాసుల రెడ్డి పాల్గొన్నారు, జంధ్యాల శరత్ బాబు వందన సమర్పణ తో సభ ముగిసింది. ఈ సభలో డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి, అడపా రామకృష్ణ, మేడా మస్తాన్ రెడ్డి, శీరేల సన్యాసిరావు, ద్విభాష్యం రాజేశ్వరరావు, సిహెచ్. చిన సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేటి నుండి రాపత్తు ఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర -సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి ఆలయంలో మంగళవారం నుండి రాపత్తు ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ముక్కోటి ఏకాదశి రోజున ప్రారంభమై జనవరి 7వ తేదీ వరకు 2026న పరమపదోత్సవంతో ముగియనుంది. ఈ ఉత్సవాల్లో స్వామివారు ఆలయం నుంచి ఊరేగింపుగా వెళ్లి వివిధ ప్రాంతాలలో భక్తులకు దర్శనమిచ్చి, ప్రత్యేక పూజలు అందుకుంటారు, వీటిని సింహాచలం, భద్రాచలం వంటి ఆలయాల్లో ఘనంగా జరుపుతారు.

నేడు ఆదర్శ్ డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా

విశాలాంధ్ర - పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కాలేజీలో డిసెంబర్ 30న ఉదయం 9 గంటలకు 10 కంపెనీలతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ఈ ఫ్లోరా తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో ఉద్యోగాల ఎంపిక కోసం మిరాకిల్ సాఫ్ట్ వేర్ సిస్టమ్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, వరుణ్ గ్రూప్, ఇనోవ్ సోర్స్, టాటా ఎలక్ట్రానిక్స్, అపోల్లో ఫార్మసీ ట్రైనీ, ఆరంజె హెల్త్ కేర్, గ్లాండ్ ఫార్మా లిమిటెడ్, డైకిన్, స్కైరూట్ కంపెనీ వారు ఆదర్శ్ డిగ్రీ కాలేజ్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నారని తెలిపారు.

గ్రాడ్యుయేషన్, డిప్లొమా, ఇంటర్మీడియట్, ఐటీఐ పూర్తయిన, డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న యువత, నిరుద్యోగ యువత జాబ్ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. జాబ్ లొకేషన్ విశాఖపట్నం, హైదరాబాద్, బెంగుళూరులలో వుంటుందని, ఈ సువర్ణ అవకాశాన్ని ఆసక్తి కలిగిన అందరూ ఉపయోగించు కోవాలని, ఈ డ్రైవ్‌కు రెజ్యూమ్ ఫోటోతో డిసెంబర్ 30న 9గంటలకి ఆదర్శ్ డిగ్రీ కాలేజీలో హాజరు అవ్వాలని కళాశాల సెక్రటరీ టి.థియోఫిలాస్ తెలియజేశారు.

ఇనాం భూములు అమ్ముకునే స్వేచ్ఛ కల్పించండి

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి నియోజకవర్గంలో ఇనాం భూములు అమ్ముకునే హక్కును ఇనాం రైతులకు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి బాగం గోపాలరావు డిమాండ్ చేశారు. ఇనాం భూములు స్వాతంత్ర్యం రాకముందు రాజులు, జమీందారులు, ఆయా కులవృత్తులు బట్టి కంసాలి, ఇనాం మంగలి, ఇనాం చాకలి, ఇనాం బారిక, ఇనాం పేర్లతో వారు సేవలు పొంది భూదానం చేశారని, భీమిలి నియోజకవర్గంలో సుమారుగా 1000 ఎకరాలు భూములు ఉన్నాయని అన్నారు. ఇనాం భూముల అమ్మకం ప్రభుత్వం నిలుపుదల చేయడం వల్ల ఇనాం రైతుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందుల పాలవుతున్నారని ప్రభుత్వం రైతులకు అమ్ముకునే స్వేచ్ఛ కల్పించాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికి వినతి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: పెదగంట్యాడ ఉక్కు నిర్వాసిత కాలనిలో గల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నెల్లిముక్కు గ్రామ పంచాయతీ పెద్దలు, శ్రీ పెంటమాంబ ఆలయ కమిటీ సభ్యులు సోమవారం గాజువాక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం సమర్పించారు. ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజిలు త్వరితగతిన పూర్తి చేయాలని, ఉక్కు నిర్వాసిత నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, పెంటమాంబ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గోందేశీ మహేశ్వర రెడ్డి, పులి వెంకట రమణారెడ్డి అప్పలరెడ్డి, యేల్లేటి శ్రీనివాసరావు, మొల్లి రమణ, పిట్ట కుంచరావు, పాల అప్పారావు, కాకినాడ సింహాచలం, డి.రామునాయుడు, గోందేశీ పెంటయ్య రెడ్డి, వై.అప్పన్న రెడ్డి, పి.కన్నయ్య తదితరులు ఉన్నారు.

బాలలే దేశ సంపద

విశాలాంధ్ర - మల్కాపురం: బాలలే దేశ సంపదని, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయ దేవి అన్నారు. స్థానిక 61వ వార్డులోని ప్రకాష్ నగర్‌లో సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్- 2 ఆధ్వర్యంలో ప్రకాష్ నగర్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు వివిధ పోటీలను ఆమె ప్రారంభించారు. చిన్నారులు క్రమశిక్షణతో, దేశభక్తితో ఎదగాలని వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. అనంతరం ఎముకుల బలంపై ప్రముఖ వైద్యులు డాక్టర్ యోగనాథ్ ప్రత్యేక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో భాగంగా వెలగా వెంకటప్పయ్య పంతులు జయంతిని కూడా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలను జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయదేవి, మల్కాపురం గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్ సమన్వయ పరిచారు.

10 జోన్లుగా జీవీఎంసీ పునఃవ్యవస్థీకరణ

జనవరి 1 నుండి అన్ని జోనల్ కార్యాలయాల్లో కార్యకలాపాలు ప్రారంభం
- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలో 2026 జనవరి 1వ తేదీ నుండి పునర్వ్యవస్థీకరించిన 10 జోనల్ కార్యాలయాలను కార్యచరణ ప్రారంభించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జోనల్ కమిషనర్‌లను జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం ఆదేశించారు. మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న జోనల్ పునర్వ్యవస్థీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

దానికి అనుగుణంగా ప్రస్తుతం ఉన్న ఎనిమిది జోన్లను 10 జోన్లుగా ఏర్పాటు చేయడం జరిగిందని, అందుకు సంబంధించి జోనల్ కార్యాలయాలు, అధికారులు, సిబ్బందిని ఏర్పాటు చేశామని తెలిపారు. 2026 జనవరి 1వ తేదీ నుండి 10 జోనల్ కార్యాలయాలు పనిచేయాలని అందుకు సంబంధించిన ఫైల్స్, రికార్డులు తారుమారు కాకుండా ఒక క్రమ పద్ధతిలో ఆయా జోన్లకు తీసుకువెళ్లాలన్నారు. ఇకపై సిబ్బంది, అధికారులు ఆయా జోనల్ కార్యాలయాల నుండి విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు.

ఆయా జోనల్ కార్యాలయం పరిధిలో ఉన్న వార్డులు, సచివాలయాలు ప్రజలకు తెలిసే విధంగా సచివాలయాల వారీగా వార్డు కార్యదర్శులు అవగాహన కల్పించాలని జోనల్ కమిషనర్లను, అధికారులను కమిషనర్ ఆదేశించారు.

జీవిఎంసి క్రొత్త జోన్ల వివరాలు'

భీమునిపట్నం జోన్ - వార్డులు: 1, 2, 3, 4 - మొత్తం 4 వార్డులు - 58.884 చ.కి.మీలు, మధురవాడ జోన్ - వార్డులు: 5, 6, 7, 8, 98 - మొత్తం 5 వార్డులు - 95.668 చ.కి.మీ లు, ఈస్ట్ జోన్ - వార్డులు: 9, 10, 11, 12, 13, 15, 16, 17, 18, 19, 20, 21, 22, 23, 28 - మొత్తం 15 వార్డులు - 48.527 చ.కి.మీ లు, నార్త్ జోన్ - వార్డులు: 14, 24, 25, 26, 42, 43, 44, 45, 46, 47, 48, 49, 50, 51, 53, 54, 55 - మొత్తం 17 వార్డులు - 19.928 చ.కి.మీలు, సౌత్ జోన్ - వార్డులు: 27, 29, 30, 31, 32, 33, 34, 35, 36, 37, 38, 39, 41 - మొత్తం 13 వార్డులు - 9.698 చ.కి.మీలు, వెస్ట్ జోన్ - వార్డులు: 40, 52, 56, 57, 58, 59, 60, 61, 62, 63, 89, 90, 91, 92 - మొత్తం 14 వార్డులు - 72.937 చ.కి.మీలు, పెందుర్తి జోన్ - వార్డులు: 88, 93, 94, 95, 96, 97 - మొత్తం 6 వార్డులు - 75.038 చ.కి.మీలు, గాజువాక జోన్ - వార్డులు: 64, 65, 66, 67, 68, 69, 70, 71, 72, 73, 74, 75, 76, 86, 87 - మొత్తం 15 వార్డులు - 108.115 చ.కి.మీలు, అగనంపూడి జోన్ - వార్డులు: 77, 78, 79, 85 - మొత్తం 4 వార్డులు - 102.830 చ.కి.మీలు, అనకాపల్లి జోన్ - వార్డులు: 80, 81, 82, 83, 84 - మొత్తం 5 వార్డులు - 41.079 చ.కి.మీలు గా విభజించడం జరిగిందని తెలిపారు. కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఇకపై జీవీఎంసీ కల్పిస్తున్న సంక్షేమ పథకాలు మౌలిక సదుపాయాలు, సేవలు ఆయా జోనల్ కార్యాలయాల ద్వారా పొందవచ్చునని తెలిపారు.

బీచ్ రోడ్‌లో శతాధిక కవి సమ్మేళనం

విశాలాంధ్ర - మల్కాపురం : బీచ్ రోడ్ ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో విశాఖ పుస్తక మహోత్సవం సందర్భంగా సాహిత్య వేదికగా శ్రమ కవనంపై నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనంలో ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ శర్మ, తెలకపల్లి రవి, గంటేడ గౌరు నాయుడు, నల్లి ధర్మారావు పాల్గొన్నారు. కవి రచయిత, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు శ్రమే నా ఆయుధం అంటూ కవితా గానం చేశారు. కవి కుమార్ రాజు, మాజీ ఎమ్మెల్సీ శర్మ చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసా పత్రంతో ఘనంగా సత్కరించారు.

యువతకు సమస్యలను పరిష్కరించే శక్తి అవసరం

విశాలాంధ్ర - మల్కాపురం: యువత సామాజిక సమస్యలను అర్థం చేసుకుని, వాటిని పరిష్కరించే శక్తిని సమకూర్చుకోవాలని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక 61వ వార్డులోని పల్లి వీధిలో సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ -1 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో సామాజిక సర్వే రిపోర్ట్‌పై ఆమె ప్రసంగించారు. ప్రజల అవసరాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం నాయకత్వంలో ముఖ్యమైన అంశమని అన్నారు. శిబిరంలో భాగంగా 550 కుటుంబాలను వాలంటీర్లు సర్వే చేసి, నివేదికను తయారు చేశారు. సర్వేలో భాగంగా అనేకమంది స్వంత గృహాలు కేటాయించాలని, పారిశుద్ధ్య పరిస్థితిని మెరుగుపరచాలని కోరారు. పశువులు ఇష్టానుసారం రోడ్లపై సంచరించి, పరిశుభ్రతకు భంగం కలిగించడంపై పలువురు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. మధ్యాహ్న కార్యక్రమాలలో భాగంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై వ్యాసరచన పోటీని వలంటీర్లకు నిర్వహించడం జరిగింది. మొత్తం కార్యక్రమాలను భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో సీనియర్ వాలంటీర్లు దేవిక, గీతిక, విశ్వజా, శిరీష ,చర్మిల నిర్వహించారు.

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ముంజేర్ దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలని, బాధితులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని భారత నాస్తిక సమాజం (బానాస) డిమాండ్ చేసింది. విజయనగరం జిల్లా భోగాపురం మండలం ముంజేర్ గ్రామం సిద్ధార్థ నగర్ ఎస్సీ కాలనీలో ఉన్న దళితులపై గత నెల 18, 20 తేదీల్లో అగ్ర కులస్తులు దళితులను కులం పేరుతో అశ్లీల పదాలతో దూషిస్తూ దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. (ఎఫ్ ఐ ఆర్ నెంబర్ 245) దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని భారత నాస్తిక సమాజం డిమాండ్ చేస్తుంది. రాష్ట్ర బా.నా.స అధ్యక్షులు పి. శ్రీరామ మూర్తి, జిల్లా భా. నా.స. అధ్యక్షులు వై.నూకరాజు మాట్లాడుతూ గ్రామస్తులు వాడుకున్న మురికినీరు దళిత కాలనీ వైపు ప్రవహిస్తుందన్నారు. ఇది జస్టిస్ పున్నయ్య సిఫార్సులకు ఉల్లంఘన. అడ్డుకున్నందుకు దళితులపై దాడి చేశారు. తిరిగి 20 మంది దళితులపై అక్రమ కేసులు పెట్టారు. అందులో ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులు కూడా ఉన్నారు. దీనిపై దళితులు గత 23 రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్నారు. దళితులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని మరియుగ్రామంలో ప్రవహిస్తున్న మురుగు కాలువ దళితుల ఇంట్లో వైపు కాకుండా ప్రత్యామ్నాయ కాలువ ద్వారా ప్రవహించే ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ మేరకు కలెక్టర్‌కి లేఖ రాశామన్నారు.

పిజిఆర్ఎస్‌కు ఐదు అర్జీలు

విశాలాంధ్ర - భీమిలి: జోన్-1 జీవీఎంసి జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంకు 05 అర్జీలు వచ్చాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి-02ఇంజనీరింగ్ విభాగానికి - 03తదుపరి చర్యలకు సంబంధిత శాఖాధిపతులకు పంపడం జరిగిందని జోనల్ కమిషనర్ అన్నారు.

అమెజాన్ డాట్ ఇన్‌లో 'గెట్ ఫిట్ డేస్' పేరుతో క్రీడా, ఫిట్నెస్ సామాగ్రి

విశాలాంధ్ర - విశాఖపట్నం: రాబోవు నూతన సంవత్సరం సందర్భంగా అమెజాన్ డాట్ ఇన్ వారి 'గెట్ ఫిట్ డేస్ 'తో క్రీడా, ఫిట్నెస్ సామాగ్రిని అందుబాటులోకి ఉంచారు. క్రీడలు, ఫిట్నెస్‌కు అవసరమైన సామాగ్రుల విస్తృతశ్రేణితో సహా వూఫ్ (డబ్ల్యూ హెచ్‌ఓఓపీ)నుండి ఇటీవల విడుదల చేసిన ఉత్పత్తులను కనుగొనవచ్చు. ఇంటివద్ద వర్కవుట్ రొటీన్ సెటప్ చేసుకుంటున్నా లేక ఫిట్నెస్ గేర్ అప్గ్రేడ్ చేసుకుంటున్నా, యోనెక్స్, లైఫ్లాంగ్, ఇంకా మరెన్నో విశ్వసనీయమైన బ్రాండ్లకు చెందిన ఉత్పత్తులను ఎక్స్‌ప్లోర్ చేయవచ్చు. ఈవెంట్ సందర్భంగా డెబిట్ మరియు క్రెడిట్ కార్డులపై ఉత్కంఠభరితమైన ఆఫర్లను కూడా కస్టమర్లు పొంది ఆనందించవచ్చు. మా కస్టమర్లు ఫిట్నెస్‌కు ఇస్తున్న ప్రాధాన్యం నానాటికి పెరుగుతోంది. దానితో అమెజాన్ డాట్ ఇన్ లో అత్యంత వేగంగా పెరుగుతున్న విభాగాల్లో ఇది ఒకటి అయ్యింది. స్పోర్ట్స్ మరియు ఫిట్నెస్ ఉపకరణాలు మొదలుకుని వేరబుల్స్ (ధరించగలిగినవి) వరకు పలు ఉత్పత్తుల పట్ల ఈ ఆసక్తి కనిపిస్తోంది అని అమెజాన్ ఇండియా కిచెన్, హోమ్ ఇంప్రూవ్మెంట్ అండ్ స్పోర్ట్స్ డైరెక్టర్ కార్తిక్ సుబ్బరాయప్ప అన్నారు.

రెవెన్యూ క్లినిక్‌కు విశేష స్పందన

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సుదీర్ఘకాలంగా నలుగుతున్న రెవెన్యూ సమస్యలకు వేగవంతమైన పరిష్కారం చూపడమే రెవెన్యూ క్లినిక్‌ల ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనల మేరకు రెవెన్యూ సమస్యల త్వరితగత పరిష్కారం కోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నామని, ఇక నుంచి ప్రతివారం పీజీఆర్ఎస్‌తోపాటు ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. జేసీతో పాటు తను కూడా వీటిని పర్యవేక్షిస్తానని చెప్పారు.

సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించగా, వీసీ హాలులో రెవెన్యూ క్లినిక్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఆర్డీవోలు, తహశీల్దార్లు అక్కడే అందుబాటులో ఉండి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అక్కడికక్కడే ఆన్లైన్ లో చూసి సమస్య స్థితిగతులను చెప్పారు. జేసీ కె.మయూర్ అశోక్ మాట్లాడుతూ సమస్యకు అప్పటికప్పుడే పరిష్కారం చూపించే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు అన్నారు.దీనివల్ల ప్రతిసారీ పీజీఆర్ఎస్ కు రావాల్సిన అవసరం ఉండదని, నేరుగా తహసిల్దార్‌ను సంప్రదించవచ్చు అన్నారు. అలాగే కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన పీజీఆర్ఎస్ లో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. దీర్ఘకాలిక సమస్యలకు వేగవంతమైన పరిష్కారం చూపేందుకు రెవెన్యూ క్లినిక్ దోహద పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉన్నత స్థాయి రెవెన్యూ అధికారులంతా ఒకేచోట ఉండి ప్రజలకు సమాధానం చెప్పటం వల్ల వారిలో విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా రెవెన్యూ క్లినిక్ కోసం కలెక్టరేట్ కింది భాగంగా ప్రత్యేక డెస్కు ఏర్పాటు చేయటంతో పాటు, దరఖాస్తులు నింపేందుకు సహాయకులను నియమించారు. ప్రజలను దగ్గరుండి వీసీ హాలులో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్ వద్దకు తీసుకెళ్లారు. ప్రజలు అధికారుల ఎదురుగా కూర్చొని ఫిర్యాదు ఇవ్వడానికి, సమస్య చెప్పుకోడానికి అవకాశం కల్పించారు. సాధారణ పీజీఆర్ఎస్‌కు 273, రెవెన్యూ క్లినిక్ కు 61 వినతులు వచ్చాయి.

కేంద్ర ప్రభుత్వం ఇంటర్నెట్ సోషల్ మీడియా బ్యాన్ చేయాలి

బిజెపి బీసీ నేత మూల వెంకటరావు

విశాలాంధ్ర -పెందుర్తి : మనదేశంలో పదహారేళ్లలోపు పిల్లలు ఇంటర్నెట్ సోషల్ మీడియా వాడకుండా కేంద్రం ఆస్ట్రేలియా తరహాలో కొత్త చట్టం తేవాలని, ఇంటర్నెట్లో అశ్లీల కంటెంట్ పెరిగిపోతున్న నేపథ్యంలో పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక చట్టం తీసుకురావాలని బిజెపి బీసీ నేత మూల వెంకట్రావు విజ్ఞప్తి చేశారు. కొత్త చట్టం వచ్చేవరకు అన్ని రకాల మీడియా ద్వారా పిల్లల్లో, తల్లిదండ్రుల్లో ఇంటర్నెట్ దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. అశ్లీల చిత్రాలు సులువుగా అందుబాటులో ఉండటం వలన పిల్లల మానసిక స్థితి దెబ్బతింటుంది. దీని అడ్డుకోవడానికి కొత్త సాఫ్ట్వేర్లను ప్రవేశపెట్టాలన్న అవసరం ఎంతైనా ఉంది. పిల్లల హక్కుల పరిరక్షణ కమిషన్లు తమ బాధ్యతగా త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. పిల్లలు తప్పుదోవ పట్టకుండా ఉండాలంటే కఠినమైన చట్టాలతో పాటు సాంకేతిక నియంత్రణ కూడా ఉండాలి. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ విషయమై స్పందించాలని మూల వెంకట్రావు అన్నారు.

భీమిలి అభివృద్ధికి నూతన ఆలోచనలతో సిద్ధంకండి

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు విజ్ఞప్తి

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి జోన్ అభివృద్ధికి నూతన ఆలోచనలు, ప్రణాళికలతో సిద్ధం కావాలని అందుకు భీమిలి ప్రజల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. భీమిలి జోనల్ కమీషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన టి.నాగేంద్ర కుమార్‌ను గంటా నూకరాజు, స్థానిక టీడీపీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలసి శాలువా, పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం గంటా నూకరాజు మాట్లాడుతూ భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు భీమిలి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా తయారు చేయాలనే లక్ష్య సాధనతో అడుగులు వేస్తున్నారని అన్నారు. నియోజకవర్గానికే భీమిలి జోన్ ఆదర్శమని అన్నారు. సుదీర్ఘ సముద్ర తీరప్రాంతం, విద్యా సంస్థలు, ప్రభుత్వ శాఖలు అన్నీ కూడా భీమిలి జోన్లో ఉన్నాయని అన్నారు. అందువలన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆలోచనలు మేరకు నూతన ప్రణాళికలతో అడుగులు వేయాలని విజ్ఞప్తి చేసారు. అందుకు కావలసిన మాయొక్క సహకారం, స్థానిక ప్రజలయొక్క సహకారం మీకు లభిస్తుందని అన్నారు. భీమిలిలో ప్రధానంగా ఉన్న పలు అభివృద్ధి పనులు, చేయవలసిన పనులపై చర్చించి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చురకల రమణ, కాసరపు నాగరాజు, మారోజు సంజీవ్ కుమార్, సంకురుబుక్త జోగారావు, జలగడుగుల మురళి, కొక్కిరి అప్పన్న, షేక్ అన్వార్, అప్పికొండ నూకరాజు, వియ్యపు పోతురాజు, రాజగిరి రమణ, శీరపు మహేష్, కుప్పిల గురుమూర్తి, నెక్కెళ్ళ వెంకటరావు, పైడిపల్లి నర్సింగరావు, అల్లిపిల్లి సతీష్, వియ్యపు నాయుడు, రేగాని శంకర్, అప్పికొండ నర్సింగరావు, సుంకరి లక్ష్మణరావు, కందుల సుందర్ రావు, సంజీవరావు, కొక్కిరి నూకరాజు, తెడ్డు సింహాద్రి, చింతకాయల అశోక్, పీతల వెంకటరావు, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సంజీవని నిధికి స్వచ్ఛంద విరాళాలు అందించండి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలోని పేదలకు, అనారోగ్య బాధితులకు సాయం చేయాలనే దృక్పథంతో నెలకొల్పిన సంజీవని నిధి - డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు స్వచ్ఛంద విరాళాలు అందించాలని, అధికారులను, దాతలను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. నూతన సంవత్సరం - 2026కు స్వాగతం పలికే సందర్భంలో గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న మానవీయమైన, అర్థవంతమైన సంప్రదాయాన్ని ఈ ఏడాదీ కొనసాగించాలని విన్నవించారు. అధికారులు, సిబ్బంది, శ్రేయోభిలాషులు అందరూ పరస్పరం శుభాకాంక్షలు తెలపడం సందర్భంగా పూలు, పండ్లు, కేకులు, మొక్కలు తదితరాలను అందించడం కన్నా.. 'సంజీవని నిధి -% జిల్లా సహాయ నిధి'కి స్వచ్ఛంద విరాళాలు అందించాలని ప్రత్యేక సందేశం ద్వారా సోమవారం విజ్ఞప్తి చేశారు. 'సంజీవని నిధి %--% జిల్లా సహాయ నిధి' ద్వారా సేకరించిన విరాళాలు జిల్లాలోని అవసరమైన, బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందించడంలో ఎంతో ఉపయోగపడుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ మానవీయ కార్యక్రమంలో భాగస్వాములు కావడం ద్వారా, సమాజంలో బాధితులకు అండగా నిలవడంతో పాటు, సామాజిక బాధ్యతకు ఆదర్శంగా నిలవగలమని ఆయన పేర్కొన్నారు. ఈ విరాళాలు పూర్తిగా స్వచ్ఛందమైనవని స్పష్టం చేస్తూ, సేవాభావంతో నూతన సంవత్సరాన్ని స్వాగతిద్దామని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.విరాళాలకు సంబంధించిన వివరాలు: నిధి పేరు: సంజీవని నిధి - జిల్లా సహాయ నిధి' ఖాతా సంఖ్య: 50100500766040 బ్యాంకు IFSC: HDFC Bank -- HDFC0009179

యువకుని ఫిర్యాదుతో సెక్స్ రాకెట్ గుట్టురట్టు

విశాలాంధ్ర - పద్మనాభం: ఓ యువకుని ఫిర్యాదుతో భీమిలి పోలీస్ స్టేషన్ వారు వ్యభిచారం ముఠా గుట్టు రట్టు చేశారు. ఓ యువకుడు పోలీసు వారికి భీమిలిలో ఓ రిసార్ట్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని సమాచారం ఇవ్వడంతో భీమిలి సిఐ నేతృతంలో పోలీసు వారు ఆ రిసార్ట్‌పై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకోగా అనుమానితురాలైన (నిర్వాహకురాలు) ఒక మహిళను పోలీసు వారు విచారిస్తున్నారు. ఈ సందర్భంగా భీమిలి సీఐ తిరుమలరావు మాట్లాడుతూ భీమిలి పిఎస్ పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగిన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇదిలా ఉంటే రాను రాను భీమిలి బీచ్ లైన్‌లో రకరకాల సంస్థలు రూములు అద్దె పేరుతో, మరికొన్ని రిసార్ట్‌లు విడిది పేరుతో విచ్చలవిడిగా మందు పేకాట, భారీ బెట్టింగ్లు జరుగుతున్నాయని అయినా పోలీస్ వారికి ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప పట్టించుకునే పరిస్థితిలో లేరని స్థానికులు వాపోతున్నారు. అసాంఘిక కార్యక్రమాలు శృతిమించుతున్న వేళ పోలీసు వారు ఏ విధంగానూ కట్టడి చేయకుండా వదిలేస్తున్నారంటూ స్థానికులు అంటున్నారు. ప్రత్యేక తనిఖీలు నిర్వహించటం గాని, అనుమానిత రిసార్టులపై, అద్దెకు రూములు ఇచ్చే భవనాలపై ఎటువంటి హెచ్చరికలు జారీ చేయడం గానీ లేనందువల్ల నిర్వాహకులకు ఈ అసాంఘిక కార్యకలాపాల వ్యాపారాలు మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఏది ఏమైనప్పటికీ యువకుడి ఫిర్యాదుతో సకాలంలో స్పందించి వ్యభిచార ముఠాను పట్టుకోవడాన్ని స్థానికులు పోలీసు వారిని అభినందించారు.

ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను వడ్డీ లేకుండా డిసెంబర్ 31లోగా చెల్లించండి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: 2025-26 ఆర్థిక సంవత్సరంనకు సంబంధించి, రెండవ అర్ధ సంవత్సరం అనగా తేది 01.10.2025 నుండి తేది 31.03.2026 వరకు గల కాలమునకు, మహా విశాఖపట్నం నగరపాలక సంస్థకు చెల్లించ వలసిన ఆస్తి పన్ను (ఇంటి పన్ను మరియు ఖాళీ స్థలము పన్ను) వడ్డీ లేకుండా చెల్లించుటకు తేది 31.12.2025 తో గడువు ముగియుచున్నందున ఆస్తి ,కాళీ స్థలాల పన్నుదారులు గృహ యజమానులు డిసెంబర్ 31 లోగా చెల్లించుకోవాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం తెలియజేశారు. నగర పరిధిలోని ఆస్తి పన్ను యజమానులు అందరూ, నగరపాలక సంస్థకు చెల్లించవలసిన ఆస్తిపన్ను బకాయిలు గడువు లోగా చెల్లించి వడ్డీ చెల్లింపు నుండి నివారణ పొందవలసినదిగా ఆయన కోరారు. మహా విశాఖపట్నం నగరపాలక సంస్థకు చెల్లించవలసిన ఇంటిపన్ను మరియు ఖాళీస్థలముల పన్ను సులభతరంగా చెల్లింపు చేయుటకు, ప్రజల సౌకర్యార్థం జి.వి.యం.సి. వెబ్ పోర్టల్‌నందు ఆస్తిపన్ను చెల్లింపు చేయుటకు క్రెడిట్ / డెబిట్ కార్డులు / నెట్ బ్యాంకింగ్ / యు.పి.ఐ లేదా యు.పి.ఐ. క్యూఆర్. కోడ్ (భారత్ పే, గూగుల్ పే, ఫోన్ పే, అమెజాన్ పే, పేటియం మరియు క్రెడ్ పే) మొదలగు చెల్లింపు మాధ్యమాల ద్వారా ఆస్తిపన్ను చెల్లింపుచేయు సదుపాయం కల్పించబడినదన్నారు. కావున నగర పరిధిలోని గృహ యజమానులు / ఆస్తిపన్ను చెల్లింపుదారులు ఈ సౌలభ్యమును వినియోగించుకొని, తేది 31.12.2025 ది లోగా ఆస్తిపన్ను (ఇంటి పన్ను మరియు ఖాళీ స్థలము పన్ను) చెల్లించి, 2025-26 సం.రం. 2వ అర్ధ సంవత్సరం ఆస్తిపన్నుపై వడ్డీ చెల్లింపు నుండి నివారణ పొందవలసినదిగా, నగర అభివృద్ధిలో భాగస్వాములు కావలసినదిగా కమిషనర్ కోరారు.

చిన్నారుల ఆరోగ్య సంరక్షణ, భద్రత కోసం పటిష్ట చర్యలు

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలో బాలల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, భద్రతను మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ కమిటీ, సిఫారసుల కమిటీ, జువెనైల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్, 2015 - సెక్షన్ 27(8) ప్రకారం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సమావేశాలు జరిగాయి. వీటిల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్. సన్యాసినాయుడు, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, సీడబ్ల్యూసీ కమిటీ సభ్యులు, అధికారులు భాగస్వామ్యమయ్యారు. జిల్లాలోని చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్స్ కు సంబంధించి తుది నమోదు సర్టిఫికెట్ల జారీ అంశాన్ని సమగ్రంగా పరిశీలించి అవసరమైన సిఫారసులు కలెక్టర్ చేశారు. జిల్లాలో అమలవుతున్న బాలల సంక్షేమం, రక్షణకు సంబంధించిన వివిధ కార్యక్రమాల పురోగతిపై ఆరా తీశారు. జువెనైల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్, 2015 -% సెక్షన్ 27(8) ప్రకారం చైల్డ్ వెల్ఫేర్, సంరక్షణ, రక్షణ, పునరావాసానికి సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించారు. జిల్లా కలెక్టర్ వివిధ అంశాలపై మాట్లాడారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు, బాలల అక్రమ రవాణ నిరోధానికి, బాల్య వివాహాల నివారణకుచ, పిల్లల పునరావాసం కోసం తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బాల కార్మిక వ్యవహారాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని, బాల్య వివాహాల నివారణకు గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. బాల, బాలిక సంరక్షణ గృహాలను పక్కాగా నిర్వహించాలని, వసతులు కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్. సన్యాసినాయుడు సూచించారు. పిల్లలకు ఆరోగ్యకర ఆహారం అందించాలని, స్వేచ్ఛాయుత వాతావరణంలో సేవలందించాలని చెప్పారు. ఈ క్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.వి.రామలక్ష్మి శాఖాపరమైన అంశాలపై వివరించారు. అనంతరం అధికారులంతా కలిసి పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సమావేశాల్లో మహిళా శిశు సంక్షేమ, ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, పోలీస్ శాఖ, జువెనైల్ వెల్ఫేర్ విభాగం అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సీడీపీవోలు, సూపర్వైజర్లు, చైల్డ్ లైన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.